తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్త పత్రిక

27-09-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 229

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




## మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

- విప్రో సర్కిల్‌లో ఆయన విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 : తరతరాలకు దార్శనికుడు, దేశం గర్వించదగ్గ జాతిరత్నం డాక్టర్ మన్మోహన్ సింగ్ అని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభివర్ణించారు. దేశ ప్రధానిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు గొప్పవని కొనియాడారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఫైనాన్షియల్

మిగతా 2వ పేజీలో..

## నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

- సీఎం రేవంత్‌రెడ్డి

2



8

## పూసలపాడు సబ్‌స్టేషన్‌లో 2 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం




# ఇక తాడోపేడో !

## రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మంది ఎస్‌జీటీల ఐక్య గళం

- సకల జనుల సమ్మె స్ఫూర్తితో మహా ఉద్యమానికి సిద్ధమవుతున్న ఎస్‌జీటీలు
- సంఘాలు చిన్నవా.. పెద్దవా కాదు.. సమస్యల పరిష్కారమే ముఖ్యం
- సంఘాల బలాబలాల కన్నా ఉపాధ్యాయుల ప్రయోజనాలే మిన్న
- పెండింగ్ ఉన్న 5 డీఏలు, పీఆర్‌సీ నివేదికను వెంటనే తేల్చాలి
- సీపీఎస్ రద్దు.. 2003 బ్యాచ్‌కు పాత పెన్షన్ అమలు చేయాలి
- ఎస్‌జీటీ-స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసం తగ్గించాలి
- ప్రపంచ దేశాల తరహాలో ప్రాథమిక గురువులకు గౌరవ వేతనం
- ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి సంఖ్యతో పనిలేకుండా తరగతికో టీచర్
- జీవో 317 బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్
- ప్రభుత్వం దిగిరాకపోతే పోరుబాట తప్పదన్న ఉపాధ్యాయ నేతలు

(తెలంగాణ బ్యూరో - సిరి న్యూస్) : తెలంగాణలోని పాఠశాల విద్యావ్యవస్థకు మూలస్తంభంగా నిలుస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం సమరశంఖం పూరిస్తున్నారు. సంఘాలు పెద్దవా, చిన్నవా అన్న బేధాభిప్రాయాలు పక్కనపెట్టి ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎస్‌జీటీ ఉపాధ్యాయ సంఘం నేతలు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 40 వేల మంది ఎస్‌జీటీలు పనిచేస్తున్నారని, తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే అందరూ ఏకతాటిపైకి వచ్చి ఐక్య పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. గతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో చారిత్రక సకల జనుల సమ్మెలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎలాగైతే భేషజాలు వీడి కలిసికట్టుగా నిలబడ్డారో.. నేడు ఎస్‌జీటీల ఆత్మగౌరవం, న్యాయమైన డిమాండ్ల కోసం కూడా అదే స్థాయి ఐక్యతను చాటిచెబుతామని నేతలు ప్రకటించారు.

### సంఘాల మధ్య పోటీ కాదు..

ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా జేఏసీల్లోని సంఖ్యాబలం ముఖ్యం కాదని, క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం వద్ద ఎవరు ఎంత ప్రభావవంతంగా వినిపిస్తున్నారన్నదే అసలైన కొలమానమని నేతలు పేర్కొన్నారు.

మిగతా 2వ పేజీలో..

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ కసరత్తు



- ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కేటీఆర్
- ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు

2



## అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా పథకాల అమలు

- 30న సిరిసిల్లకు ముఖ్యమంత్రి: మంత్రి తుమ్మల
- బహిరంగ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

3

## విద్యుత్ సిబ్బంది పనితీరు అభినందనీయం

- వినాయక ఉత్సవాలను విజయవంతం చేశాం
- ట్యాంక్‌బండ్, హుస్సేన్ సాగర్ సహా ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ

2



## రైతులను రాజులను చేయడమే 'రైతు బడి' లక్ష్యం

- మాజీ మంత్రి హరీశ్ రావు

2





## చేతకాకపోతే పాలన నుంచి తప్పుకోవాలి

- అధ్వానంగా విద్య, వైద్య రంగాలు
- ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నాం: టీఆర్ఎస్ చీఫ్ కవిత

3

## ఈసీ నిష్పాక్షికత తేలాలి

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 : ఎన్నికల పోరులో ప్రజాస్వామ్యానికి రిఫరీగా వ్యవహరించాల్సిన భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను కోల్పోవడం రాజ్యాంగ

మిగతా 3వ పేజీలో..

## కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

- మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

3

## డీజీపీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి



2



# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశ అత్యున్నత పురస్కారంతో ఆయనను సత్కరించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి గుండెకాయలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేశామని చెప్పారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన సరళీకృత విధానాలు తెచ్చారని గుర్తు చేశారు. భారత్‌ను సంక్షోభం నుంచి దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ గట్టెక్కించారని చెప్పారు. నాడు ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ తెలంగాణ బిల్లుపై సంతకం చేశారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, మాజీ ఆర్థిక సలహాదారు మోహన్ గురుస్వామి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, నవీన్ యాదవ్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు.

# నిబద్ధత గల నేత లక్ష్మణ్ బాపూజీ

**హైదరాబాద్ సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు నిబద్ధతతో పోరాడిన ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి తన ఇల్లు, ఆస్తులను సైతం అంకితం చేసిన బాపూజీ ప్రజా హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని చెప్పారు. బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. తెలంగాణ కోసం బాపూజీ చేసిన త్యాగాలు, చూపిన మార్గం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన సేవలు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామని గుర్తు చేశారు.

# రైతులను రాజులను చేయడమే 'రైతు బడి' లక్ష్యం

**ఎల్బీనగర్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26:**

సాధారణ పాఠశాలలు ఉత్తమ పౌరులను తయారు చేస్తే రైతులను నిజంగా రాజులను చేయాలనే మహత్తర లక్ష్యంతో రైతు బడి ఏర్పడిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తెలిపారు. ఎల్బీ నగర్ చిత్రా లేఅవుట్‌లో శనివారం నిర్వహించిన 'రైతు బడి గ్రూప్' గ్రాండ్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డిజిటల్ యుగంలో ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ వ్యవసాయ రంగంలో రావాల్సినంత పురోగతి ఇంకా రాలేదన్నారు. ఆ లోటును భర్తీ చేస్తూ రైతులకు అవసరమైన టెక్నాలజీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లాభదాయక పంటలు, మార్కెటింగ్ సమాచారాన్ని అందించే ఒక అనుసంధాన వేదికగా రైతు బడి నిలుస్తుందని ఆకాంక్షించారు. ఇక్కడ రైతులే ఉపాధ్యాయులని, వారి క్షేత్రస్థాయి అనుభవాలే పాఠాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో కుంకుడు కాయల సాగు ద్వారా ఆదాయం పొంది మార్గదర్శకంగా నిలిచిన పద్మనాభం ఉదాహరణను ఆయన గుర్తు చేశారు. పంటల వారీగా, జిల్లాల వారీగా 30 యూట్యూబ్ ఛానళ్లు, ఒక మ్యాగజైన్ ప్రారంభించి 30 లక్షల మంది వీక్షకులకు




చేరువైన నిర్వాహకుడు రాజేంద్ర ప్రయత్నాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా అభినందించారు. సిద్ధిపేట ప్రాంతంలో తాను స్వయంగా చొరవ తీసుకుని వేలాది ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించానని, నాలుగైదేళ్ల వ్యవధిలోనే రైతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కంటే మెరుగైన ఆదాయాన్ని ఆర్జిస్తున్నారని తెలిపారు. రైతుల్లో కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన చాలా ఉందన్న హరీశ్ రావు రైతు బడి ద్వారా వారికి సరైన మార్గదర్శకత్వం లభిస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్దతు తెలపడమే కాక ఈ సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.



# డీజీపీ కార్యాలయంలో ఐలమ్మ జయంతి

**హైదరాబాద్ సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను డీజీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వీరనారి చాకలి ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన ధైర్యసాహసపూరిత పాత్రను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజి అడ్మిన్ జె. అన్యోన్య, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, సీఏవోలు, సూపరింటెండెంట్లతోపాటు ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇక తాడోపేడో !

**మొదటిపేజీ తరువాయి**

'మా సంఘం గొప్పదా.. మరో సంఘం పెద్దదా అనే అనవసర చర్చలకు తెరదించాలని, ఉద్యోగుల డిమాండ్లు నెరవేరడమే ప్రతి సంఘం అంతిమ లక్ష్యం కావాలని.. ఏ సంఘమైనా సరే న్యాయమైన సమస్యలపై చిత్తశుద్ధితో పోరాడాలి అని స్పష్టం చేశారు. ఎస్‌జీటీ కేడర్‌ను లేదా తమ సంఘాన్ని చిన్నచూపు చూసే ధోరణి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, రాబోయే రోజుల్లో 40 వేల మంది ఎస్‌జీటీల సంఘటిత పోరాట శక్తి ఏమిటో పాలకులకు రుచి చూపిస్తామని హెచ్చరించారు.

**అరకొర డీఏలతో సరిపెట్టొద్దు..**

ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఏ నిర్ణయంతో క్షేత్రస్థాయి ఉపాధ్యాయులు ఎంతమాత్రం సంతృప్తి చెందలేదని నేతలు కుండబద్దలు కొట్టారు. కొన్ని పెద్ద సంఘాలు డీఏ ప్రకటన రాగానే సంబరాలు చేసుకున్నప్పటికీ, సాధారణ ఉపాధ్యాయుల డిమాండ్లు మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రావలసిన 5 డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ నివేదికను తెప్పించి వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయడంతో పాటు, 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా విధుల్లో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. ఉపాధ్యాయుల కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసిన జీవో 317 సమస్యలను సమగ్రంగా సమీక్షించి స్థానికత ఆధారంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఎస్‌జీటీ-స్కూల్ అసిస్టెంట్ల వేతన అంతరాలు తగ్గించాలి..**

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే ఎస్‌జీటీలకు, ఉన్నత పాఠశాల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు మధ్య ఉన్న భారీ వేతన అంతరాలను తగ్గించాలనేది తమ ప్రధాన డిమాండ్ అని నేతలు ఉద్ఘాటించారు. సమాజంలో ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న ప్రాథమిక గురువులకు గౌరవప్రదమైన వేతన శ్రేణిని అందించాలని కోరారు. అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల్లో ప్రాథమిక స్థాయిలో పనిచేసే ఉపాధ్యాయులకే అత్యున్నత ప్రాధాన్యం, సమాన వేతన వ్యవస్థలు అమలవుతున్నాయని గుర్తుచేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కూడా అదే రీతిలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా వేతన వ్యత్యాసాలను సవరించాలని విజ్ఞప్తి చేశారు.

**తరగతికో ఉపాధ్యాయుడిని నియమించకుంటే పోరుబాటే..**

ఉమ్మడి ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీల సమావేశాల్లో ప్రాథమిక పాఠశాలలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదన్న ఆవేదనతోనే ఎస్‌జీటీ సంఘం బలమైన వేదికగా ఏర్పడిందని నేతలు తెలిపారు. జీవో 25ను పక్కనపెట్టి, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికో ఉపాధ్యాయుడిని తప్పనిసరిగా నియమించాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనులు, యాప్‌ల భారం నుంచి ఎస్‌జీటీలను విముక్తులను చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్‌జీటీల డిమాండ్లను పరిష్కరించకపోతే.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులను కదిలించి శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతిలో మహా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ కసరత్తు

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఎన్నికలకు ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో శనివారం విడివిడిగా భేటీ అయ్యారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో తీవ్రంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతోపాటు తమ కుటుంబాలు, అన్నదాతలు, మహిళలు, యువత సహా రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. అయితే ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. కర్తలు ఐకమత్యంతో పనిచేసి ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# నేషన్ ఫస్ట్.. అదే మా సిద్ధాంతం

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

భారత దేశంలో రాబోయే రాజకీయ పోరు గాంధీ పరివార్ వర్సెస్ సంఘ్ పరివార్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలే కాంగ్రెస్ నడిపే కుటుంబ స్వార్థ రాజకీయాలకు, సంఘ్ పరివార్ నమ్ముకున్న నిస్వార్థ దేశ భక్తికి మధ్య ఉన్న తేడా ఏంటో ప్రజలకు స్పష్టం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయం అంటే ఒకే ఒక్క కుటుంబంతో మొదలవుతుంది.. ఆ కుటుంబంతోనే ముగుస్తుందని తెలిపారు. కానీ తమకు ఏ ఒక్క వ్యక్తి లేదా కుటుంబం కంటే దేశ ప్రయోజనాలే ఎల్లప్పుడూ ముఖ్యం అని స్పష్టం చేశారు. దేశంపై ఎమర్జెన్సీ రుద్ది ప్రజల గొంతు నొక్కింది, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ కాదా అని నిలదీశారు. 1984లో దేశ రాజధాని నడిబొడ్డున వేలాదిమంది అమాయక సిక్కులను ఊచకోత కోసిన రక్తచరిత్ర కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని గుర్తు చేశారు. 26/11 ముంబైపై పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేసి భారత ప్రజలను పొట్టనబెట్టుకుంటే కనీసం పాకిస్థాన్‌పై ఎదురుదాడి చేసే ధైర్యం లేక చేతులెత్తేసింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ అని ఆయన విమర్శించారు. చివరకు 2013 నాటికి మన దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అత్యంత బలహీనమైన ఐదు దేశాల సరసన నిలబెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ పాలనదేనన్నారు. సంఘ్ పరివార్ ఏ ఒక్కరి ఇంటిపేరు మీదో, ఒక కుటుంబం వారసత్వం మీదో నడిచేది కాదని, ఎలాంటి పదవులు, పేర్లు ఆశించకుండా కేవలం సమాజ సేవ, దేశ నిర్మాణం, క్రమశిక్షణ కోసం జీవితాలను త్యాగం చేసిన తరతరాల కార్యకర్తల త్యాగాలతో నిలబడిన వ్యవస్థ అని వివరించారు.

# విద్యుత్ సిబ్బంది పనితీరు అభినందనీయం

- **టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 51,207 వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా**
- **రూ.17.80 కోట్లకు పైగా వ్యయం భరించిన ప్రభుత్వం**
- **సీఎండీ జితేష్ వి. పాటిల్**

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్):**

తెలంగాణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్న వినాయక చవితి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించింది. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందించిందని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంకితభావంతో పనిచేసిన విద్యుత్ సిబ్బంది తీరు అభినందనీయమని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 202627 ఆర్థిక సంవత్సరంలో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో మొత్తం 51,207 వినాయక విగ్రహాలు, మండపాలు అధికారికంగా నమోదయ్యాయి. వీటి కోసం 1,12,586 కిలోవాట్ల విద్యుత్ లోడ్ మంజూరు చేయబడగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు రూ.17.80 కోట్ల విద్యుత్ వ్యయాన్ని సంస్థ భరించింది. కేవలం జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మరియు సైబరాబాద్ కార్పొరేషన్‌ల పరిధిలోని బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లలో మాత్రమే 20,128 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం 60,217 కిలోవాట్ల లోడ్ మంజూరు చేయగా, సుమారు రూ.9.04 కోట్ల విద్యుత్ వ్యయం ఖర్చయింది. గత ఏడాది (202526)తో పోలిస్తే ఈ ఏడాది వినాయక మండపాల సంఖ్య 47,649 నుంచి 51,207కు పెరిగింది. అలాగే విద్యుత్ లోడ్ 98,627 కిలోవాట్ల నుంచి 1,12,586 కిలోవాట్లకు, విద్యుత్ వ్యయం రూ.15.59 కోట్ల నుంచి రూ.17.80 కోట్లకు పెరిగినట్లు సీఎండీ వెల్లడించారు.

సమన్వయంతో విజయవంతమైన ఉత్సవాలు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం మూలంగా నిమజ్జనం కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయగలిగామని సీఎండీ పేర్కొన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పోలీస్, జీహెచ్ఎంసీ, మున్సిపల్ సంస్థలు, రెవెన్యూ మరియు ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేసింది. వినాయక మండపాలు, ఊరేగింపు మార్గాలు, నిమజ్జన కేంద్రాలు, లైటింగ్ వ్యవస్థలు, విద్యుత్ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, అత్యవసర ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా వ్యవస్థలను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. సెప్టెంబర్ 14వ తేదీ నుంచి నిమజ్జనోత్సవాలు పూర్తయ్యే వరకు టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించారు. ముఖ్యంగా హుస్సేన్ సాగర్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, ఐడీఎల్ చెరువు, సరూర్‌నగర్, ఉప్పల్, దుర్గం చెరువు, మేడ్చల్, రాజేంద్రనగర్ తదితర ప్రధాన నిమజ్జన కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు అండగా నిలుస్తూ వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా అందించిందని, అన్ని శాఖల సమన్వయం మరియు విద్యుత్ ఉద్యోగుల అంకితభావం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు విజయవంతమయ్యాయని సీఎండీ తెలిపారు.

# అగ్రశ్రేణి పర్యాటక గమ్యంగా తెలంగాణ

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబరు 26:**

తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణకు ఘనమైన చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, సంస్కృతి, ప్రకృతి, వన్యప్రాణులు, వంటకాలు, ఆధునిక పట్టణ ఆకర్షణలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని వారసత్వ సంపద నుంచి యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం వరకు, వరంగల్, యాదాద్రి, భద్రాచలం, నాగార్జునసాగర్, సోమశిల, నల్లమల అడవులు, జలపాతాల వరకు రాష్ట్రంలో విభిన్న పర్యాటక అనుభవాలకు అవకాశాలున్నాయని వివరించారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా తొలుత రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంతో ఇప్పుడు రూ.50 వేల కోట్ల పెట్టుబడులు రాబట్టడం, 5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకలో తెలంగాణను అగ్రశ్రేణి రాష్ట్రాల్లో నిలపడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. టూరిజం పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలోనే



రాష్ట్రానికి రూ.22,174 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వాటిని కార్యరూపంలోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం-2026 ప్రధాన ఇతివృత్తమైన 'డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి పునఃరూపకల్పన' తెలంగాణకు ఎంతో సముచితమని మంత్రి అన్నారు. తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌ను పునఃరూపకల్పన చేసి ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వచ్చే పర్యాటకులకు ఆధునిక, సమగ్ర డిజిటల్ వేదికగా ఇది అందుబాటులో ఉంటుందని చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రధాన పర్యాటక ఆకర్షణలను సందర్శించేందుకు వీలుగా హాప్-ఆన్, హాప్-ఆఫ్ పర్యాటక సేవలను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

పర్యాటక రంగంలో సరికొత్త ప్రయోగంగా 'రివర్స్ టూరిజం - ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' కు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. నగరవాసులు పల్లెలు, ప్రకృతి ప్రాంతాలకు వెళ్లడం మాత్రమే కాక అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని ప్రత్యక్షంగా చూసేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. పర్యాటక రంగంలో యువత, మహిళలు, కళాకారులు, గైడ్లు, ఆతిథ్య రంగ సిబ్బంది, రవాణా నిర్వాహకులు, స్థానిక పారిశ్రామికవేత్తలకు అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. గ్రామీణ, పర్యావరణ, సమాజ ఆధారిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక సమాజాలు అభివృద్ధిలో భాగస్వాములై, దాని ప్రయోజనాలను నేరుగా పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పర్యాటక అభివృద్ధి వారసత్వ సంపద, అడవులు, వన్యప్రాణులు, జలవనరులు, సహజ పర్యావరణ పరిరక్షణతో సమన్వయంగా సాగాలని అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న పర్యాటక నిపుణులు, పారిశ్రామికవేత్తలు, గైడ్లు, హోటల్ నిర్వాహకులు, టూర్ ఆపరేటర్లు, కళాకారులు, స్థానిక సమాజాలకు మంత్రి అభినందనలు తెలిపారు.

# కాళేశ్వరం పునరుద్ధరణ పనులు నవంబర్‌లో ప్రారంభం

- **వర్షాకాలానికి ముందే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పనులు పూర్తి**
- **5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందుకు డిజైన్లు**
- **జాతీయ సాంకేతిక సంస్థల సూచనల మేరకే పనులు**
- **మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సమగ్ర పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించి 2027 వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. మూడు బ్యారేజీల భద్రత పటిష్టంతోపాటు వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అవసరమైన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిందని తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల పునరుద్ధరణ ప్రతిపాదనలపై మంత్రి శనివారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు డిజైనర్ రూపొందించిన పునరుద్ధరణ ప్రణాళికలో గ్రౌటింగ్ ద్వారా పునాదులను బలోపేతం చేయడం, స్టిల్లింగ్ బేసిన్లను పొడిగించడం, కొత్తగా కట్ ఆఫ్ వాల్స్ నిర్మించడం వంటి కీలక పనులు ఉన్నాయని తెలిపారు. వరద ప్రవాహ వేగాన్ని నియంత్రించే ఏర్పాట్లలో ఉన్న లోపాలను సరిచేయడంతోపాటు పునాదుల స్థిరత్వాన్ని పెంచడం, పునాదుల కింద నీటి చౌరబాటును అరికట్టడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)తోపాటు ఇతర నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. బ్యారేజీల నిర్మాణ భద్రత, పునరుద్ధరణ పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. శాస్త్రీయ అధ్యయనాలు, జాతీయస్థాయి సాంకేతిక సంస్థల సిఫారసుల ఆధారంగానే ప్రతీ పని జరుగుతుంది అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపాదిత డిజైన్లను పుణేలోని కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా కేంద్రం(సీడబ్ల్యూపీఆర్ఎస్)లో కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ నమూనాల ద్వారా పరీక్షిస్తున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిల్లో వరద ప్రవాహం ఉన్నప్పుడు బ్యారేజీల వద్ద నీటి ప్రవాహ తీరు ఎలా ఉంటుందో, ప్రతిపాదించిన చర్యలు ఎంత సమర్థంగా పనిచేస్తాయో ఈ పరీక్షల ద్వారా నిర్ధారిస్తారని చెప్పారు. ఖరారు చేసిన డిజైన్లను అక్టోబర్ 5న ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక పర్యవేక్షణ



కమిటీ ముందు ఉంచనున్నట్లు మంత్రి వెల్లడించారు. కమిటీ నిపుణులు వాటిని పరిశీలించి అవసరమైన సూచనలు, సిఫారసులు చేస్తారని తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను ఏకకాలంలో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పునరుద్ధరణ పనులకు సంబంధించిన సమగ్ర వ్యయ అంచనాలను నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం అవసరమైన కాంట్రాక్టు విధానాన్ని కూడా ఖరారు చేస్తున్నట్లు తెలిపారు. డిజైన్లకు అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులను అప్పగించేలా మొత్తం ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పనుల అమలులో కఠినమైన నాణ్యతా ప్రమాణాలు, స్వతంత్ర పరీక్షలు, స్పష్టమైన కాలపరిమితులు ఉండాలని ఆదేశించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సాంకేతికంగా పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే విధానాలతో మూడు బ్యారేజీలను పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ తెలిపారు. పునరుద్ధరణ పనులు పూర్తయి, జాతీయ సాంకేతిక సంస్థల నుంచి అవసరమైన భద్రతా అనుమతులు వచ్చిన తర్వాతే బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకొస్తాం అని తేల్చిచెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలను పూర్తిస్థాయిలో పాటిస్తూ, ప్రతి దశను నిపుణుల పరిశీలనకు లోబడి నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కార్యక్రమంతో సంబంధం ఉన్న ఇంజినీర్లు పాల్గొన్నారు.

# ఈసీ నిష్పాక్షికత తేలాలి

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థలకే ప్రమాదకరమని, ఈసీ స్వతంత్రతపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ప్రస్తావిస్తూ కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు-పునరుద్ధరణ, ఓటరు డేటాబేస్ కేంద్రీకరణ వంటి 14 కీలక అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వెల్లడైందన్నారు. గోవాలో అర్హులైన 97 మంది ఓటర్లను అధికారులు ధ్రువీకరించినప్పటికీ కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ లోపం వల్ల తుది జాబితాలో పేర్లు చేరకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థ వైఫల్యమేనని మండిపడ్డారు. సాంకేతికత మనిషి సౌలభ్యం కోసం ఉండాలి కానీ సాంకేతికత నెపంతో పౌరుల ఓటు హక్కును బలి ఇవ్వకూడదు అని ఆయన పేర్కొన్నారు.

**13 కోట్లకు పైగా ఓటర్ల తొలగింపుపై ఆందోళన**

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించడంపై మంత్రి ఉత్తమ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు వేసే రోజుకు ముందే తప్పులను సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని, ఎన్నికలు పూర్తయ్యాక పేరు చేర్చడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు.

**ఎంపిక కమిటీ మార్పులపై విమర్శలు**

ఈసీ నియామక ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా నిర్ణయాత్మక ఆధిపత్యాన్ని కేంద్రం తన వద్దే ఉంచుకుందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు సీఈసీ నియామకాన్ని వాయిదా వేయాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరినప్పటికీ ప్రభుత్వం తొందరపడి జ్ఞానేశ్ కుమార్‌ను నియమించిందని ఆరోపించారు. కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలతో పాటు ఓటరు జాబితాల నిర్వహణకు ఉపయోగిస్తున్న సాంకేతిక వ్యవస్థ పనితీరుపై ఉన్నత స్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా ప్రభుత్వ ఆస్తి కాదని, ఓటు అధికార పార్టీ సొత్తు కాదని పేర్కొన్న మంత్రి, పౌరుల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలోపోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# చేతకాకపోతే పాలన నుంచి తప్పుకోవాలి

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**



రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పాలన చేతకాకపోతే బాధ్యతల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అధ్వాన పరిస్థితిపై ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖానల్లో పట్టిపీడిస్తున్న సమస్యల కారణంగా రాష్ట్రంలో ఏటా సగటున నాలుగు వేల మంది చిన్నారులు కన్నుమూస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 202021 లో 6 వేలు, 202223 లో 4,933, 202425 లో 3,853 మంది పసిపిల్లలు చనిపోయారు.. ఏ జిల్లాలో చూసినా దాదాపు 200 వరకు పిల్లలు చనిపోయిన పరిస్థితి. న్యూయార్క్, డల్లాస్ చేస్తామన్న హైదరాబాద్‌లో గతేడాది 1046 మంది పిల్లలు చనిపోయారు అని తెలిపారు. వైద్య రంగానికి 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి కనీసం 5 శాతం కూడా వెచ్చించకపోవడం దారుణమన్నారు. గతేడాది కేటాయించిన రూ.13,192 కోట్లలో రూ.9,242 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, 11 ఆరోగ్య పథకాలకు గాను ఏడు పథకాలకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ కోసం రూ.700 కోట్లు కేటాయిస్తే రూ.140 కోట్లే ఖర్చు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ స్కీం పెండింగ్ బకాయిలు రూ.500 కోట్లు ఉంటే పైసా విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్, హైదరాబాద్ నిమ్స్, నిలోఫర్ దవాఖానల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కవిత ఆరోపించారు. నిలోఫర్‌లో 200 శాతం బెడ్ ఆక్యుపెన్సీ ఉంటే నిమ్స్‌లో శస్త్రచికిత్స కోసం ఏడు నెలలు నిరీక్షించాల్సి వస్తోందన్నారు. ఆదిలాబాద్ వెళ్లి రిమ్స్ హాస్పిటల్ పరిస్థితి సమీక్షించాల్సిన హెల్త్ మినిస్టర్ హెలికాప్టర్ ఫ్యూయల్ అయిపోయిందని గొడవపడి వెళ్లిపోయారే తప్ప రోగులకు సరైన వైద్యం అందించాలని ఆదేశాలు ఇవ్వలేదని కవిత మండిపడ్డారు. ఆదిలాబాద్ రిమ్స్ లో ఎక్కడ చూసిన చెత్తాచెదారమే కనిపించిందన్నారు. రాష్ట్ర మంత్రి, ప్రతిపక్ష నాయకులు ఇటీవల రిమ్స్ ను సందర్శించారని, అక్కడే పరిస్థితి ఇలా ఉంటే మిగతా హాస్పిటల్స్ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా కలెక్టర్లు ఎందుకు ప్రభుత్వ హాస్పిటల్స్, హాస్టల్స్ విజిట్ చేయడం లేదని ప్రశ్నించారు.

**ఆస్తులపై సవాల్.. సిట్‌లన్నీ డైవర్షన్ డ్రామాలు**

తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపించిన దానికంటే రూపాయి ఎక్కువ ఉన్నట్లు నిరూపిస్తే ఆ ఆస్తిని తిరిగి ఇచ్చేస్తానని కవిత స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ అన్ని చట్టబద్ధ అనుమతులతో నిర్మించుకున్నదని, అందులో ఎలాంటి ఎఫ్‌టీఎల్, కబ్జా భూములు లేవని తేల్చిచెప్పారు. కేసీఆర్, కేటీఆర్ ఫామ్‌హౌస్‌లు, ఫోన్ ట్యాపింగ్‌లపై వేసిన 'సిట్' లు కేవలం కాలయాపనకేనని, ప్రభుత్వం విఫలమైనప్పుడల్లా డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే వీటిని తెరపైకి తెస్తోందని విమర్శించారు.

**ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ**

రాబోయే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు. వేరే పార్టీలో గెలిచిన వ్యక్తికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల సభలో నేరెళ్ల బాధితులకు న్యాయం చేసే అంశంపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.

# ప్రతి పంచాయతీకి సొంత భవనం

మొదటిపేజీ తరువాయి

రూ.800 కోట్ల అంచనా వ్యయంతో మహిళా సంఘాల భవనాలను నిర్మిస్తున్నామని, ఈ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని మంత్రి చెప్పారు.

**'హ్యామ్' విధానంలో గ్రామీణ రహదారులు**

దేశంలోనే తొలిసారిగా గ్రామీణ రహదారుల నిర్మాణానికి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో నాలుగు జిల్లాల్లో 3,861 కిలోమీటర్ల మేర రహదారుల కోసం రూ.3,382 కోట్లు వెచ్చిస్తున్నామని, అక్టోబర్ నుంచి జూన్ వరకు పనులకు అనువైన సమయం కాబట్టి నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత వ్యవధిలోగా రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

**వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళిక**

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. సింగూరు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గినందున ప్రత్యేక అధికారిని నియమించి నిజాంసాగర్ నుంచి నీటిని తరలించే చర్యలను వేగవంతం చేయాలన్నారు. నీటి నిర్వహణ, లభ్యతపై పర్యవేక్షణకు ప్రతి మండలానికి ముగ్గురు సభ్యులతో డ్రింకింగ్ వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన, ఆదివాసీ, చెంచు పెంట ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**రూ.6,000 కోట్లతో ఉపాధి హామీ – జలసిరి పనులు**

వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, అందుబాటులో ఉన్న రూ.6,000 కోట్ల బడ్జెట్‌ను వినియోగించి గ్రామాల్లో శాశ్వత ఆస్తులు, మౌలిక వసతులు, 'జలసిరి' కింద నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

**బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు**

అభివృద్ధి పనులలో అధికారులు, కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి సీతక్క హెచ్చరించారు. అద్భుతమైన పనితీరు కనబరిచే అధికారులను ప్రభుత్వం గౌరవించి సన్మానిస్తుందని స్పష్టం చేశారు.





# అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా పథకాల అమలు

**సిరిసిల్ల, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రగుడు బైపాస్ రోడ్ సమీపంలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బిగితెతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 33 నెలల ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల సంక్షేమ లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. రైతులు, నేతన్నలు, అన్ని వర్గాల ప్రజలు లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పాలన అందిస్తుందని తెలిపారు. జిల్లా అభివృద్ధి సంక్షేమ పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి విచ్చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ నెల 30న కరీంనగర్ జిల్లాలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌ను ప్రారంభించడంతోపాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి భారీ బహిరంగ సభలో పాల్గొంటారని, ఈ సందర్భంగా 33 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు. అదే సమయంలో సామాజిక న్యాయం, ప్రజాస్వామిక ఆకాంక్షలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా మాట్లాడనున్నారన్నారు. 33 నెలల ప్రజా ప్రభుత్వం సంక్షేమ రంగంలోనే కాకుండా వ్యవసాయం, సాంకేతిక రంగం, మౌలిక వసతులు, సాగునీరు, విద్య, ఉపాధి తదితర అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, సమీకృత అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రత్యేకంగా సిరిసిల్ల నేత కార్మికుల సమస్యలపై సంబంధిత శాఖ మంత్రి తుమ్మల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో కూడా నేతన్నలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. చలో సిరిసిల్ల ద్వారా ప్రజా పాలన విజయాన్ని చాటుదామని పిలుపునిచ్చారు.

# పర్యాటకానికి ప్రత్యేక గుర్తింపు తేవాలి

- **ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో టూరిజం రంగానికి కొత్త ఊపు**
- **పీపీపీ విధానంలో మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రోత్సాహం:**
- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 26 :**

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)లను విస్తృతంగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. డిజిటల్ అజెండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు అనే ఇతివృత్తంతో ప్రపంచ పర్యాటక దినోత్సవం2026 వేడుకలు శిల్పారామంలో శనివారం ఘనంగా జరిగాయి. వేడుకలకు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన డిజిటల్ అజెండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు ప్రాధాన్యతను భట్టి విక్రమార్క వివరిస్తూ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని గ్లోబల్ వేదికపై ఆవిష్కరించే నూతన వెబ్‌సైట్‌ను, అద్భుత చిత్రాలతో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. టైగర్ రిజర్వులు, అడవులు, జలపాతాలు, ప్రాచీన ఆలయాలు, నగరంలోని చారిత్రక కట్టడాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని, ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని పేర్కొన్నారు. వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు సూచించారు.

**పీపీపీ విధానంలో ప్రాజెక్టులు, బడ్జెట్ పెంపు**

గతంతో పోలిస్తే ఈసారి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. సందర్శకుల భద్రత, నాణ్యమైన వసతులకు తమ పాలసీలో పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అంతర్జాతీయ స్థాయి హోటళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని స్పష్టం చేశారు. వారంలో ఐదు రోజులు తీవ్ర ఒత్తిడితో పనిచేసే హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను పర్యాటకం వైపు మళ్లించేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ మంత్రి, కార్యదర్శి కలిసి ప్రముఖ ఐటీ కంపెనీల సీఈవోలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులతో త్వరలోనే సమావేశం కావాలని ఆదేశించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు టూరిజం కూపన్లు అందించి వారాంతాల్లో ప్రకృతి ప్రాంతాలను సందర్శించేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటక శాఖ చేపడుతున్న నూతన కార్యక్రమాలను అభినందిసూ రాష్ట్ర పర్యాటక కీర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాలని ఆకాంక్షించారు.

**నూతన కార్యక్రమాలకు శ్రీకారం**

పునర్ రూపకల్పన(రీడిజైన్) చేసిన తెలంగాణ టూరిజం వెబ్‌సైట్, ఆన్‌లైన్ హోమ్‌స్టే రిజిస్ట్రేషన్ విధానం, కొత్త టూరిజం ట్రైలర్లు, ఇంటరాక్టివ్ ఏఆర్/వీఆర్ ఆధారిత లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, తెలంగాణ పర్యాటక ప్రాంతాలపై కాఫీ టేబుల్ బుక్, మై తెలంగాణ, మై స్టోరీ, మై డెస్టినేషన్ అంశంపై వీడియో/పోస్టర్, ఎకో టూరిజంపై వీడియోను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి సమక్షంలో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూపరింటెండెంట్ నిఖిల్ దాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పురావస్తు శాఖ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు□) కుదుర్చుకున్నారు. 'ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ డిజిటల్ టెక్నాలజీ ది ఫ్యూచర్ ఆఫ్ టూరిజం', ఎకో టూరిజం, ఫిల్మ్ టూరిజం, స్పోర్ట్స్ టూరిజం, హెరిటేజ్ టూరిజం తదితర రంగాల్లో వస్తున్న మార్పులు, అవకాశాలపై ప్యానెల్ చర్చ జరిగింది.

# ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జరుపుకుందాం

- **పద్మశాలి సంఘం నెంబర్-1 అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం.**



**సదాశివపేట. సెప్టెంబర్ 26. (సిరిన్యూస్)**

ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు నెంబర్ 1. మునిపల్లి విశ్వనాథం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మునిపల్లి విశ్వనాథం మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి అని, స్వాతంత్ర సమరయోధులు తొలి మలిదశ తెలంగాణ ఉద్యమకారుడని అని తెలిపారు. కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. బస్టాండు వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# ఆత్మ గౌరవ పోరాటానికి ప్రతీక చాకలి ఐలమ్మ



- **ఐలమ్మ ధైర్యం.. నేటి తరానికి స్ఫూర్తి దాయకం.**
- **మెదక్ జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస రావు.**

**మెదక్ సెప్టెంబర్,26(సిరి న్యూస్)**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సామాజిక అన్యాయాన్ని, అణచివేతను ఎదురిస్తూ ఆత్మగౌరవం, హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం, మహిళల గౌరవం, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ సూచించారు. యువత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు సందీప్ రెడ్డి, శైలందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం




**తూప్రాన్ సెప్టెంబర్ 26 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్. కొక్కొండ సమత కాశిరెడ్డి మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ సమక్షంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు

అదేవిధంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు ఈ సమావేశంలో కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# నిమజ్జనం ప్రశాంతం

- **ఎస్ఐ సత్యనారాయణ**

**హవేలీఘనపూర్ (సిరి న్యూస్ )**

హవేలీఘనపూర్ మండలంలోని అన్ని గ్రామాలలో గత తొమ్మిది రోజులుగా పూజలు అందుకున్నటువంటి గణేష్ లకు నిమజ్జనం చేయడానికి చెరువుల వద్ద పకడ్బందీగా తమ సిబ్బందితో పహారా కాయడం అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గ్రామప్రజలకు మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సలహాలు సూచనలు ఇస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు నాతోపాటు మా సిబ్బందిని కూడా అహర్నిశలు కృషి చేసినందుకు అభినందిస్తున్నట్టు తెలిపారు

# పౌష్టికాహారంతోనే నవ సమాజ నిర్మాణం





- **ప్రపంచంలోనే అత్యంత అరుదైన స్కీమ్ సీఎం అల్పాహారం.**
- **30 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నాం.**
- **ఉపాధి,కార్మిక ,గనుల భూగర్భ శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి.**

**మెదక్ సెప్టెంబర్,26(సిరి న్యూస్)**

ప్రపంచంలో అత్యంత అరుదైన స్కీమ్ సీఎం అల్పాహారం పథకం అని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోనీ మార్కెట్ యార్డ్ లో నూతనంగా నిర్మించిన కేంద్రీకృత కిచెన్ ను మంత్రి వివేక్ వెంకటస్వామి, మెదక్ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు ,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి ప్రారంభించారు. కేంద్రీకృత కిచెన్ యంత్రాలకు పరిశీలించి వాటి సామర్థ్యం ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెదక్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షనల్ లో ప్రభుత్వ విద్యార్థులకు అల్పాహారం వడ్డించి , విద్యార్థులతో పాటు కలిసి అల్పారాన్ని తిన్నారు. అల్పాహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ముఖ్యమంత్రి అల్పాహారం పథకం అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికరమైన అల్పాహారం అందించడమే ముఖ్య ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. హరికృష్ణ మూమెంట్ టీంకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలన్నారు. పాఠశాలలకు మార్నింగ్ 8:30 కి టిఫిన్ వస్తుందనీ, రాష్ట్రవ్యాప్తంగా 36 కిచన్ లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఇప్పటికే 10 వేల మంది టీచర్స్ ను భర్తీ చేశాం అని,మెదక్ లో యంగ్ ఇండియా స్కూల్ ను 2,500 మంది విద్యార్థులకు గాను వచ్చే సంవత్సరం నుండి ప్రారంభిస్తామన్నారు. మెదక్ కు 100 కోట్ల తో పబ్లిక్స్ స్కూల్ కూడా వచ్చిందని, తెలంగాణలో 12 తరగతి విద్యార్థుల వరకు అల్పాహార పథకాన్ని అందిస్తామన్నారు. అల్పాహార పథకం రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థులకు ఇస్తున్నాం అని ,టెక్నాలజీ కోసం నూతనంగా ఏటీసీ సెంటర్ ప్రారంభించామని, అందులో శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా నాణ్యమైన , పౌష్టికాహారం అందించి, విద్య వైద్యం పై దృష్టి సారిస్తున్నామన్నారు. మెదక్ లో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభించి మెదక్ విద్యార్థుల యొక్క భవిష్యత్ ను ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లాలో 30 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ రెడి హరే కృష్ణ మూవ్మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ (హెచ్కెఎంసిఎఫ్) అధ్యక్షుడు, అక్షయ పాత్ర ఫౌండేషన్ (టిజి & ఆంధ్రప్రదేశ్) ప్రాంతీయ అధ్యక్షుడు హిస్ గ్రేస్ సత్య గౌర చంద్ర దాస (ఎం.టెక్., ఐఐటి మద్రాస్), మాట్లాడుతూ... జిల్లాలో 30 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కేంద్రీకృత కిచెన్ ను మొదట కొడంగల్ లో ప్రారంభించామన్నారు. కొడంగల్ లో ఆదర్శంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా కొడంగల్ పరిసర పాఠశాలలో 20% విద్యార్థులు అదనంగా పాఠశాలలో చేరుతున్నారన్నారు. కిచెన్ షెడ్ ను 40 రోజుల్లో పూర్తి చేశామన్నారు. జిల్లా ప్రజలందరూ సహకారంతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు,జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సీఈఓ (హెచ్కేఎంసిఎఫ్) కౌంతేయదాస ప్రభుజి, పిఆర్ ఇన్చార్జి రవిలోచన దాస్ ప్రభువుజి,డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,ఏరియా మేనేజర్ నాగేశ్వర్ రెడ్డి సంబంధిత ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.






# 'ఆరోహణ'తో ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ఘన స్వాగతం

- **ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను చేరుకోవాలని కళాశాల ప్రతినిధుల సూచన**




**సంగారెడ్డి: సెప్టెంబర్ 26 ( సిరి న్యూస్)**

సెయింట్ ఆంథోనీస్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు 'ఆరోహణ' పేరుతో ఘనంగా స్వాగత వేడుకలు నిర్వహించారు. 'Realise.. Raise.. Reach' అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం వెల్కమ్ డ్యాన్స్‌తో ప్రారంభమైంది. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, ఫౌండర్ డాక్టర్ ఈదర సాల్మన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులను ధైర్యంగా అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన కృషితో ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా వాటిని ఎదుర్కొని విజయాన్ని సొంతం చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. భవిష్యత్తును బంగారుమయం చేసుకునేలా కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ జవహర్ మాట్లాడుతూ.. విద్యార్థినులు కళాశాల జీవితాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర రంగాల్లో ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అకాడమిక్ కౌన్సిలర్ డాక్టర్ కృష్ణకుమారి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్య, క్రమశిక్షణ, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాగంగా క్లాస్ రిప్రజెంటేటివ్‌లను సన్మానించి బ్యాడ్జెస్ అందజేశారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు, మోమెంటోలు అందజేశారు.అనంతరం నిర్వహించిన మిస్ ఫ్రెషర్స్ ఎంపికలో ఉమైమ మసీరా, మిస్ కాన్ఫిడెంట్‌గా హరిని ఎంపికయ్యారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి కిరీటాలు ధరింపజేశారు.సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థినుల కేరింతలు, చప్పట్లతో కళాశాల ప్రాంగణం మారుమోగింది. ఉత్సాహం, ఉల్లాసం నడుమ 'ఆరోహణ' వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందంతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ

- **ఆమె పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం.**
- **మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్.**
- **బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు.**



**మెదక్ సెప్టెంబర్,26(సిరి న్యూస్)**

తెలంగాణ సాయుధ పోరాటంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి చిరస్మరణీయమని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల.మల్లికార్జున్ గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి శనివారం మెదక్ పట్టణంలోని వెల్కమ్ బోర్డు వద్ద ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ. ఆంజనేయులు లు మాట్లాడుతూ.. నాటి సామాజిక పరిస్థితుల్లో పేదలు, రైతులు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా\
ఐలమ్మ తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి నిలిచి తన హక్కుల కోసం పోరాడిన ఆమె ధైర్యం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు.ఐలమ్మ పోరాటం ఒక్క వ్యక్తి కోసం మాత్రమే కాకుండా అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం సాగిన ఉద్యమానికి ప్రతీకగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి. కృష్ణారెడ్డి,పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది.కృష్ణ గౌడ్,మాజీ కౌన్సిలర్లు భీమరి.కిషోర్ మాయ.మల్లేశం,ఆర్కే. శ్రీనివాస్, నాయకులు ప్రభు రెడ్డి, లింగారెడ్డి, మోచి.కిషన్,సాదిక్, ఇస్మాయిల్,వేణు,యువ నాయకులు కసాపురం.కిరణ్, చేదల అరుణ్, ఎంబిపూర్ మహేష్ మరియు రజక సంఘం నాయకులు విజయ్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి అనుసరణీయం

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు , సెప్టెంబర్ 26, (సిరి న్యూస్):**

తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరాలకు అనుసరణీయమని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని, పటాన్ చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. నేటి తరానికి వారి చరిత్రను తెలిపేలా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం సాగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, రజక సంఘం అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్

**సంగారెడ్డి: సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖైదీలకు అందుతున్న న్యాయ సహాయం, సౌకర్యాలను పరిశీలించేందుకు ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. భవాని చంద్ర కంది కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి భవాని చంద్ర కంది కేంద్ర కారాగారంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న మౌలిక సౌకర్యాలు, న్యాయ సహాయం, ఇతర సేవలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఖైదీలకు తమ చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, అందుబాటులో ఉన్న న్యాయ సేవలపై అవగాహన



కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన ప్రతి అర్హుడైన ఖైదీకి సకాలంలో న్యాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున పనిచేస్తున్న ఎల్ ఏ డి సిఎస్ కౌన్సెల్స్ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఖైదీల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టపరమైన పరిష్కార మార్గాలను చూపేందుకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఖైదీల పునరావాసంతో పాటు న్యాయ అవగాహన కల్పించడం, వారు విడుదలైన అనంతరం సమాజంలో గౌరవప్రదంగా తిరిగి జీవించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడం కూడా ముఖ్యమని జడ్జి తెలిపారు. ఈ సందర్భంగా డి ఎల్ఎస్ఎ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ అర్హులైన ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం పనిచేస్తోందన్నారు. ఖైదీలు తమకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలపై ఎల్ ఏ డి సిఎస్ కౌన్సెల్‌స్‌ను సంప్రదించి అవసరమైన న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంది కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ సంతోష్ రాయ్, ఎల్ ఏ డి సిఎస్ కౌన్సెల్స్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి 25 కేజీల భారీ లడ్డూ సమర్పించిన

# పులిమామిడి రాజు

**సదాశివపేట. సెప్టెంబర్ 26. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని పాతకేరి ప్రాంతంలో ఉషాకిరణ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి పులిమామిడి రాజు పాల్గొని ప్రత్యేక కలశ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకునికి ఇష్టమైన లడ్డూను ప్రత్యేకంగా శివలింగం ఆకారంలో 25 కేజీల భారీ లడ్డూగా తయారు చేయించి స్వామివారికి సమర్పించారు. అనంతరం బామిని అరుణ-రవికుమార్ దంపతులు, చీలం మాధవి-సురేష్ దంపతులు వినాయకునికి చివరి కలశ పూజ నిర్వహించి కలశాన్ని కదిలించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి పులిమామిడి రాజు వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన మహిళా కళాకారుల కోలాటం, చిటికెలు, అఘోర కళాకారుల ప్రదర్శనలు, డప్పు చప్పుళ్ల నడుమ వినాయకుడిని పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమతతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని వారు కూడా సంతోషంగా కళాకారులతో కలిసి స్టెప్పులు వేశారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో వార్డు ప్రజలు, మహిళలు, పురుషులు, ఉషాకిరణ్ యూత్ సభ్యులు పాల్గొని వివిధ రకాల నృత్యాలతో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని ఊబ చెరువులో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.



# ఘనంగా వినాయక నవరాత్రులు





- **13 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు.**
- **ఆగమనం నుంచి నిమజ్జనం వరకు వైభవంగా వేడుకలు..**
- **ప్రత్యేక కార్యక్రమాలతో ఆకట్టుకున్న టీం వాల్మీకి.**

**రామాయంపేట, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**

రామాయంపేట పట్టణంలో టీం వాల్మీకి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణనాథుడి ఆగమనం నుంచి నిమజ్జనం వరకు ప్రతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తూ పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వినాయక చవితి సందర్భంగా గణనాథుడిని ఘనంగా ఆహ్వానించి ప్రతిష్ఠించిన నిర్వాహకులు, 13 రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజలు, హారతులు, భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిరోజూ భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టీం వాల్మీకి ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభంలో గణనాథుడి ఆగమనాన్ని ఎంత వైభవంగా నిర్వహించారో, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అంతే ఘనంగా నిర్వహిస్తూ ప్రత్యేకతను చాటుకున్నారు. భక్తుల సందడి, పూజా కార్యక్రమాలు, యువత ఉత్సాహం మధ్య వినాయక నవరాత్రులు ఆద్యంతం భక్తిమయ వాతావరణంలో సాగాయి. టీం వాల్మీకి సభ్యుల సమన్వయంతో నిర్వహించిన వేడుకలు రామాయంపేట పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## తెలంగాణ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ

- **దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకీ చంద్ర భాను**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26,**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూస్వామ్య దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలిగిన చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట కేంద్రంలో శనివారం ఆమె విగ్రహానికి పలువురు ప్రజా సంఘాల నేతలు ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రబాను, నాయకులు మాట్లాడుతూ దోపిడి వర్గం పేద ప్రజలను వంచిస్తున్నటువంటి రోజులలో స్త్రీల యొక్క శక్తి గొప్పదని నిరూపించి దొరల దౌర్జన్యాలు దోపిడీలను చేస్తున్నటువంటి వారిని ఎదిరించి తెలంగాణ సాయుధ పోరాటంలో ఒక ఉద్యమ చైతన్యాన్ని నిలిపినటువంటి చాకలి ఐలమ్మ ఎప్పటికీ చిరస్మరణీరాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవర మల్లయ్య, ఇతర నాయకులు శ్రావణ్ కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి





- **కాంగ్రెస్ నాయకులు ఎం.క్రిష్ణ**
- **వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన క్రిష్ణ దంపతులు**

**జోగిపేట, సెప్టెంబర్26,(సిరి న్యూస్) :**

గణపయ్య ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండి పాడి పంటలతో పాటు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మొరబోయిన క్రిష్ణ అన్నారు. అందోలు మండల పరిధిలోని కన్సాన్ పల్లి గ్రామంలో ఈశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద క్రిష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ సాంప్రదాయ బద్ధంగా పూజా తంతును వైభవంగా జరిపించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున వినాయక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా క్రిష్ణ మాట్లాడుతూ ఐక్యత భక్తి శ్రద్దలతో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా స్వామి వారికి ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తూ ప్రశాతం వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవడం పట్ల ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఎలాంటి ఆటాంకులు లేకుండా ప్రతికార్యం విజయవంతంగా ముగిసేలా గణపయ్య అశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

**36 రకాల నైవేద్యాల సమర్పణ...**

ఉత్సవాలలో భాగంగా గణేషుడికి మహాప్రసాద మహోత్సవ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ మహిళ భక్తులు గణనాథునికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 36 రకాల విభిన్న రకాల నైవేద్యాలను సమర్పించారు. పులిహోర, పొంగలి, గారెలు, పాయసం, అరిసెలు, బూంది, బాదుషాలు, కాజాలు ఇలా 36 రకాల పిండివంటలతో, పండ్లు, ఫలహారాలతో స్వామివారి ముందు మహాప్రసాదాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఏర్పాటు చేసి స్వామివారికి సమర్పించారు

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



- **సంగారెడ్డిలో విగ్రహానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాల**

**సంగారెడ్డి: సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**

తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆమెకు ఘన నివాళులు అర్పించారు. కలెక్టరేట్ పక్కన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, తెగువ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి జగదీష్, నాయకులు రామప్ప, నగేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు.

# వైభవంగా హనుమాన్ ఆలయం రుద్ర యూత్ వినాయక నిమజ్జనం

- **లడ్డూ వేలంలో భారీ ధరలు.. రూ.3.20 లక్షలకు మొదటి లడ్డూ**

**సంగారెడ్డి: సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**



సంగారెడ్డి పట్టణంలోని 10వ వార్డు హనుమాన్ ఆలయం వద్ద రుద్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడి శోభాయాత్రను ఘనంగా చేపట్టారు. యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, డీజేలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం భక్తిశ్రద్ధల మధ్య వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలంపాట ఆసక్తికరంగా సాగింది. భక్తులు, స్థానికులు ఉత్సాహంగా వేలంలో పాల్గొనడంతో లడ్డూలకు భారీ ధరలు పలికాయి. లడ్డూ వేలంలో మొదటి లడ్డూను కలివేముల సత్యనారాయణ గౌడ్ రూ.3 లక్షల 20 వేలకు దక్కించుకున్నారు. రెండో లడ్డూను కలివేముల అవినాష్ గౌడ్ రూ.2 లక్షల 52 వేలకు సొంతం చేసుకున్నారు. వేలం ద్వారా వచ్చిన మొత్తంతో పాటు నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో హనుమాన్ ఆలయం పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# నెలాఖరులోగా నోటీసులు సమర్పించాలి



- **తహసిల్దార్ సింధూ రేణుక**
- **99.50% కంప్లీట్**

**హవేలీఘనపూర్ (సిరి న్యూస్)**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓ ల ద్వారా నోటీసులు అందుకున్న వారు ఈ నెల ఆఖరులుగా తగిన ఆధారాలు చూపించి ఓటు హక్కును కాపాడుకోవాలని తహసిల్దార్ సింధు రేణుక తెలిపారు హవేలీ ఘనపూర్ మండలంలో మొత్తం 7738 ఓటర్లకు నోటీసులు అందజేయగా నిన్నటి వరకు 7691 మంది సంబంధిత బిఎల్ఓ లకు అందజేశారు మిగిలిన 47 మంది ఈ నెలాఖరులోగా తగిన దువపత్రాలతో బి ఎల్ వో ను లేదా తహసిల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి ఓటును సరి చేసుకోవాలని ఆమె కోరారు

# శివంపేట మాజీ సర్పంచ్ పబ్బ రమేష్ గుప్తాను పరామర్శించిన ఎమ్మెల్యే!!



**శివంపేట సెప్టెంబర్ 26 (సిరి న్యూస్ )**

శివంపేట మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్తా అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శివంపేటలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్ గుప్తా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు. రమేష్ గుప్తా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో శివంపేట గ్రామ సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, గొర్రె వెంకట్ రెడ్డి, లక్ష్మీనర్సయ్య, పోచయ్య, వంజరి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

# రసాయన శాస్త్రంలో ప్రేరణ లూంబాకు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, సెప్టెంబర్ 26, (సిరి న్యూస్)**



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ప్రేరణ లూంబా డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'అమ్మోనియా, ఎసిటిలీన్ కోసం మెటల్ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్ (MOF), కోవలెంట్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్ (COF) పదార్థాల సంశ్లేషణ, లక్షణాల పరిశీలన, గది ఉష్ణోగ్రత వద్ద వాయువును గుర్తించే పనితీరు'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

అమ్మోనియా, ఎసిటిలీన్ వంటి ప్రమాదకరమైన వాయువులను సున్నితంగా, ప్రత్యేకంగా గుర్తించడం కోసం, పోరస్ మెటల్ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కులు (ఎంవోఎఫ్ లు), కోవలెంట్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్కులు (సీవోఎఫ్ లు) రూపకల్పన, అభివృద్ధిపై ఆమె డాక్టరల్ పరిశోధన కేంద్రీకృతమై ఉందని తెలియజేశారు. ఈ అధ్యయనం, షిఫ్ బేస్ఉత్పన్న, మెటల్డోప్డ్ ఫ్రేమ్ వర్కుల యొక్క అసాధారణమైన సెన్సింగ్ పనితీరు, స్థిరత్వం, ఎంపిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. పర్యావరణ పర్యవేక్షణ, పారిశ్రామిక భద్రత, ప్రజారోగ్యంలో వీటికి వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ పరిశోధనలో, నిర్దిష్ట వాయువులను గుర్తించడం కోసం Zn(TDA) and Co(TDA) MOFs, బహుళ లోహ కేంద్రాలు కలిగిన అధికఎంట్రోపీ ఎంవోఎఫ్ లు, జింక్డోప్డ్ సీవోఎఫ్ ల అభివృద్ధి ఉన్నాయన్నారు. అధునాతన డీ ఎఫ్టీ అధ్యయనాలు ఈ పదార్థాల మెరుగైన సెన్సింగ్ విధానాలను, ఎలక్ట్రానిక్ లక్షణాలను మరింతగా ధృవీకరించాయని వివరించారు.

# హనుమాన్ మందిర ఘనంగా గణేష్ నిమజ్జనం



- **ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్.**

**సదాశివపేట. సెప్టెంబర్ 26. (సిరిన్యూస్)**

హనుమాన్ నగర్ లోని హనుమాన్ మందిరం వినాయకుని నిమజ్జనం హనుమాన్ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణేశునికి నిమజ్జన ఉత్సవ సందర్భంగా ఆఖరి పూజలను నిర్వహించి అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్త బృందంచే ఊరేగింపులో భజనలు
భక్తి పాటలు పాడుతూ నిమజ్జన్న యాత్ర కొనసాగించడం జరిగింది. అనంతరం గణేశుని నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్, పంతులు శివ కోటి స్వామి, సంగమేశ్వర్, శంకరపల్లి శ్రీనివాస్ గౌడ్, వీరేశం, రవి, శిల చంద్రశేఖర్, దశరథ్ రెడ్డి, రమేష్ గౌడ్,వీరేశం, తుమ్మలపల్లి నాగేష్, సంగమేశ్వర్, సుదర్శన్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



- **చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలను వేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి**

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 26, (సిరి న్యూస్):**

పెద్ద శంకరంపేట పట్టణం లో చాకలి అయిలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణ శివారు లోని తిరుమలాపూర్ చెరువు కట్ట వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూల మాలలు వేశారు. భూమి కోసం, భుక్తి కోసం, పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ
నాయకులు నారా గౌడ్, మురళి పంతులు, సుభాష్ గౌడ్, దాచ సంగమేశ్వర్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్లు గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు వెంకట్రావు, గాజు కుమార్, ప్రశాంత్ రెడ్డి, మండల రజక సంఘం అధ్యక్షుడు చాకలి ప్రభు, బాధ్యులు వెంకటేశం, కిష్టయ్య, లక్ష్మణ్, సాయి, నరేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కాలేజీ తరలింపు యత్నానికి బ్రేక్!





- **ఉద్యోగ భద్రత కోసమే తరలింపు కుట్రా?**
- **విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనతో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జోక్యం**
- **నర్సాపూర్ యూఆర్జేసీ నర్సాపూర్‌లోనే కొనసాగించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

**నర్సాపూర్, సెప్టెంబర్ 26:**

నర్సాపూర్ తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల యూఆర్జేసీ కళాశాలను కౌడిపల్లికి తరలించే ప్రయత్నంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జోక్యం చేసుకోవడంతో వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. నర్సాపూర్ యూఆర్జేసీ కళాశాలను నర్సాపూర్‌లోనే కొనసాగించాలని ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

**ఉద్యోగ భద్రత కోసమేనా?**

కౌడిపల్లిలో కొనసాగుతున్న యూఆర్జేసీ కళాశాలలో అడ్మిషన్లు లేకపోవడంతో దానిని మరో ప్రాంతానికి తరలించే పరిస్థితి ఏర్పడితే, ప్రస్తుతం అక్కడ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి ప్రిన్సిపాల్ హోదాను కోల్పోయి మరోచోట కేవలం సబ్జెక్టు టీచర్‌గా పనిచేయాల్సి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో నర్సాపూర్ యూఆర్జేసీ కళాశాలను కౌడిపల్లికి తీసుకువస్తే, అక్కడ ప్రస్తుతం ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వ్యక్తి ప్రిన్సిపాల్ హోదాలోనే కొనసాగేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం జరిగిందని విద్యార్థులు, తల్లిదండ్రుల వర్గాల్లో ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో వ్యక్తిగత ఉద్యోగ ప్రయోజనాల కోసం సంబంధిత ఆర్సీఓతో కొందరు అధికారులు చేతులు కలిపి నర్సాపూర్ యూఆర్జేసీని కౌడిపల్లికి తరలించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు తమ వివరణ ఇవ్వాల్సి ఉంది.

**విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన**

నర్సాపూర్‌లో కొనసాగుతున్న యూఆర్జేసీ కళాశాలను మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నం జరుగుతోందన్న విషయం తెలియడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే నర్సాపూర్‌లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులను మరో ప్రాంతానికి తరలించడం వల్ల వారి చదువులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల నిర్వహణలో మార్పులు చేయాలంటే ముందుగా విద్యార్థుల భవిష్యత్తు, అడ్మిషన్ల పరిస్థితి, సిబ్బంది అవసరాలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

**ఎమ్మెల్యే జోక్యంతో తరలింపు యత్నానికి అడ్డుకట్ట**

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన విషయం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆమె అధికారులతో మాట్లాడినట్లు తెలిసింది. నర్సాపూర్ యూఆర్జేసీ కళాశాలను కౌడిపల్లికి తరలించే ఆలోచనను నిలిపివేసి, నర్సాపూర్ యూఆర్జేసీ కళాశాలను నర్సాపూర్‌లోనే యథావిధిగా కొనసాగించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని, కేవలం కొందరి ప్రయోజనాల కోసం విద్యాసంస్థల నిర్వహణలో మార్పులు చేయవద్దని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

## బట్టబయలైన అధికారుల తీరుపై ఆరోపణలు!

ఎమ్మెల్యే జోక్యంతో నర్సాపూర్ యూఆర్జేసీని నర్సాపూర్‌లోనే కొనసాగించే దిశగా స్పష్టత రావడంతో ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై చర్చ మొదలైంది. అసలు కౌడిపల్లికి నర్సాపూర్ యూఆర్జేసీని తరలించే ప్రతిపాదన ఎందుకు వచ్చింది? దాని వెనుక విద్యార్థుల ప్రయోజనమా? లేక కొందరి ఉద్యోగ ప్రయోజనమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కౌడిపల్లి యూఆర్జేసీలో అడ్మిషన్లు లేకపోవడాన్ని సాకుగా చూపి నర్సాపూర్ యూఆర్జేసీని తరలించే ప్రయత్నం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్ణయం వెనుక ఉన్న వాస్తవాలను బయటపెట్టాలని వారు కోరుతున్నారు. ఏది ఏమైనా.. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్పందించి నర్సాపూర్ యూఆర్జేసీని నర్సాపూర్‌లోనే కొనసాగించాలని అధికారులకు స్పష్టత ఇవ్వడంతో తరలింపు వ్యవహారానికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

# రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలి





- **కార్మిక ,గనుల భూగర్భ శాఖ మంత్రి,మెదక్ ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి.**

**మెదక్ సెప్టెంబర్,26(సిరి న్యూస్)**

రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని,సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం మెదక్ పట్టణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకట స్వామి, మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి పొదుపు పద్ధతులు, యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ..రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ప్రభుత్వం రైతాంగానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక విధానాలను వ్యవసాయంలో అవలంబించాలని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. కిసాన్ మేళాలో వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ పి ఓ లు), వ్యవసాయ యాంత్రీకరణ సంస్థలు మరియు విత్తన/ఎరువుల సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతులకు అవసరమైన సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఏడి శ్రీధర్ రాజశేఖర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, శాస్త్రవేత్తలు సతీష్, సాంబాజి దత్తాత్రేయ నాల్కర్, ప్రొఫెసర్ నిర్మల, రాఘవేంద్ర, ఆదిత్య లు ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నర్సింలు,యుగేందర్ రెడ్డి, మరియు సభ్యులు పాల్గొన్నారు.

# 2 లక్షల 5 వేలకు లడ్డూను దక్కించుకున్న టీఆర్ఎస్ నేత సాయికుమార్ రెడ్డి

**పటాన్ చెరు, సెప్టెంబర్ 26, (సిరి న్యూస్);**



పటాన్ చెరు పట్టణ కేంద్రంలో శ్రీ నగర కాలనీ లోని వినాయక మండపం వద్ద నిర్వహించిన వేలం పాటలో టీఆర్ఎస్ నేత, కల్వకుంట్ల కవిత అనుచరుడు వై.సాయి కుమార్ రెడ్డి 2 లక్షల 5 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం రాత్రి శ్రీనగర్ కాలనీలోని జై గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో రెండు లక్షల ఐదు వేల ఐదు వందల యాభై ఐదు రూపాయలకు దక్కించు కోవడంతో పాటు గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న రికార్డు ను సైతం బ్రేక్ చేశారు. ఆయన వరుసగా నాలుగోసారి లడ్డును దక్కించుకున్నాడు. 2023 లో ఒక లక్ష పది వేలు, 2024 లో తొంబై ఐదు వేలు, 2025 లో ఒక లక్ష ఇరవై మూడు వేల రూపాయలకు దక్కించుకొని హ్యాట్రిక్ సాధించడం విశేషం. దాంతో పాటు శుక్రవారం జరిగిన వేలం పాటలో రెండు లక్షల ఐదు వేల ఐదు వందల యాభై ఐదు రూపాయలకు లడ్డూను దక్కించుకొని, తన రికార్డును తానే బద్దలు కొట్టడం విశేషం. ఈ సందర్భంగా సాయి కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. గణపయ్యపై ఉన్న భక్తి, నమ్మకంతోనే ప్రతి ఏడాది వేలంలో పాల్గొంటున్నానని తెలిపారు. గణపయ్య ఆశీస్సులతో పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# మహాలయ పక్షం ప్రారంభం

- **నేటి నుంచి నుండి అక్టోబర్ 10 వరకు ఆచరణ**
- **పితృదేవతల ఆరాధనకు ప్రత్యేకమైన 15 రోజుల పుణ్యసమయం**
- **భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు సాగే పవిత్ర కాలం**

**పెద్ద శంకరంపేట, సిరి న్యూస్:**

భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు సాగే మహాలయ పక్షం నేటితో ప్రారంభమై, అక్టోబర్ 10వ తేదీ మహాలయ అమావాస్యతో ముగుస్తుంది. ఈ 15 రోజులూ పితృదేవతలకు అత్యంత ప్రీతికరమైన కాలంగా శాస్త్రాలు చెబుతున్నాయి. కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ తమ పితృదేవతలకు తర్పణ, శ్రాద్ధ, అన్నదానాలు సమర్పించి వారి ఆశీస్సులు పొందాలని పురోహితులు, పెద్దలు సూచిస్తున్నారు. ఈ పక్షంలో ఉదయం ఇంటి ప్రధాన ద్వారం వద్ద నిలబడి, చేతులు జోడించి పితృదేవతలను స్మరిస్తూ, 'నేను పితృపక్షం పూర్తిగా పాటించలేకపోతున్నాను, దయచేసి మన్నించి మీ దీవెనలు అందించండి' అని మనస్సులో ప్రార్థించడం వల్ల శుభఫలితాలు కలుగుతాయని శాస్త్రీయ విశ్వాసం. కుదరని పక్షంలో, పితృదేవతలు చనిపోయిన తిథి ఈ పక్షంలో వస్తే ఆ రోజు శ్రాద్ధం నిర్వహించాలి. తండ్రి జీవించి, తల్లి లేనివారు నవమి నాడు తర్పణ, శ్రాద్ధ విధులు ఆచరించాలి. తల్లీ, తండ్రీ ఇద్దరూ లేనివారు ఈ పక్షంలో తప్పక పితృకర్మలు చేయాలి. పూర్తి పక్షం కుదరకపోతే కనీసం మహాలయ అమావాస్య నాడైనా చేయాలి.

**పురాణ నేపథ్యం..**

దానశీలి అయిన కర్ణుడికి మరణానంతరం స్వర్గంలో ఆకలి, దప్పిక తీరకపోవడం, ఆ తర్వాత ఇంద్రుడి అనుగ్రహంతో భూలోకానికి వచ్చి అన్నదానం, పితృతర్పణాలు చేసి ఆకలి తీర్చుకోవడం ఈ కథే మహాలయ పక్షం ఏర్పాటుకు కారణంగా చెబుతారు. కర్ణుడు భాద్రపద బహుళ పాడ్యమి నాడు భూలోకానికి వచ్చి, అమావాస్య నాడు స్వర్గానికి తిరిగి వెళ్లాడని, ఆ 15 రోజులే మహాలయ పక్షంగా పిలువబడుతున్నాయని పురాణ సంప్రదాయం. కావున ప్రతి ఒక్కరూ కులాలకు, మతాలకు అతీతంగా తమ కుటుంబంలో, స్నేహితుల్లో, గురువుల్లో మరణించిన పితృదేవతలకు తిల శ్రాద్ధం కానీ, అన్న శ్రాద్ధం కానీ సమర్పించి వారి అనుగ్రహం పొంది, వంశాభివృద్ధికి వారి ఆశీస్సులు పొందగలరు.

# అక్కన్నపేటలో మోదీ పరిపాలనపై వ్యాసరచన పోటీలు..






- **సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా...**

**రామాయంపేట, సెప్టెంబర్ 26 (సిరి న్యూస)**

సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రధానమంత్రి శ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రామాయంపేట మండలం అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోదీ పరిపాలన, దేశ అభివృద్ధిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఈ వ్యాసరచన పోటీల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పీఎం శ్రీ పాఠశాలల ద్వారా విద్యా సంస్థలను అభివృద్ధి చేయడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అక్కన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల పీఎం పాఠశాలగా అభివృద్ధి చెందుతున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మింగర్తి రంగయ్య, సోషల్ మీడియా మండల ప్రముఖులు శేఖర్, అక్కన్నపేట మాజీ సర్పంచ్ వెలుముల సిద్ధరాములు, ఎలగారి అశోక్ పాల్గొన్నారు.



# రైతులు,కౌల్ రైతులు జీవిత కాలం అప్పులతో బ్రతుకడమేనా ?

- **రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విధానాన్ని సమీక్షించుకోవాలి**
- **తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు**
- **పాకాల శ్రీనివాసరావు**



**రామాయంపేట, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ విధానం లో మార్పు రానంత కాలం వ్యవసాయ రంగానికి భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, పంటల ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీ, రైతులు, మరియు కౌల్ రైతుల జీవితాలు ఆర్థికంగా బాగుపడలేవనీ తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు విమర్శించారు శనివారం ఆయన రామాయంపేటలో మీడియాతో మాట్లాడారు. నేటికీ రాష్ట్రంలో మెజారిటీ రైతులు, కౌలు రైతులు ప్రైవేటు అప్పుల వడ్డీ భారాన్ని మోస్తున్నారు. తమ పిల్లల పేరిట బ్యాంకుల్లో కనీషం రూ.10 వేల ఫిక్స్డ డిపాజిట్ (FD) కూడా చేసుకోలేని దీనస్థితిలో తెలంగాణ రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు ప్రభుత్వ ఖజానాపై ఒక్క రూపాయి అదనపు భారం పడకుండానే రైతుల వ్యక్తిగత ఆదాయాన్ని, గౌరవాన్ని, వారికి అందే సేవలను మెరుగుపరిచే పలు మార్గాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్య మంత్రి, వ్యవసాయ శాఖామాత్యులు, రైతులు, రైతుసంఘాల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతు, రైతులు ఆర్థికంగా బాగుపడే చర్యలు వెంట , వెంటనే చేపట్టాలని ఆయన కోరారు.

# స్థానిక ఉత్పత్తులకు జై..

- **స్థానిక ఉత్పత్తులపై అవగాహన..**
- **రైతులు, మహిళా సంఘాలకు ప్రోత్సాహం..**
- **చిదం సాగర్ ఆధ్వర్యంలో కార్యక్రమం..**
- **బీజేపీ నేతల విస్తృత పాల్గొనడం..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి**
**సెప్టెంబర్ 26 (సిరి న్యూస్)**



స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను కొనుగోలు చేసి, రైతులు, కళాకారులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో 'వోకల్ ఫర్ లోకల్' కార్యక్రమం నిర్వహించారు. నెన్నెల మండలం మైలారం ఎస్టీ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం ప్రజల్లో అవగాహన కల్పించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బియ్యం, పప్పులు, చిరుధాన్యాలు, వేరుశెనగ, నువ్వులు, మిరపకాయలు, తేనె, పసుపు, వెదురు హస్తకళలు, చేనేత వస్త్రాలు, మట్టి పాత్రలు, పచ్చళ్లు, మసాలాలు, మహిళా సంఘాల ఉత్పత్తులు, గిరిజన హస్తకళలను ప్రోత్సహించాలని ప్రజలకు వివరించారు. స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ పెరిగితే రైతులు, కళాకారులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులకు ఆదాయం పెరగడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యక్రమం ఎస్టీ మోర్చా నెన్నెల మండల అధ్యక్షులు చిదం సాగర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అంగాల శేఖర్, ఎస్టీ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అదే ప్రేమ్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి బాలరాజ్, గుగులోత్ ఇందల్ నాయక్, జిల్లా సమాచార సాంకేతిక విభాగం కన్వీనర్ కోడిపె మహేందర్ తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా కొనుగోలు చేద్దాం.. స్థానిక వ్యాపారాన్ని బలోపేతం చేద్దాం.. ఆత్మనిర్భర్ భారత్‌కు తోడ్పడదాం అంటూ పిలుపునిచ్చారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్):**

చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ సండే మార్కెట్ సమీపంలోని ఆమె విగ్రహానికి భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలను, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్కిల్ మాజీ అధ్యక్షుడు పరమేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి ప్రభు, సభ్యులు సాయి, శ్రీనివాస్, భిక్షపతి, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విశేష కృషికి అరుదైన గౌరవం.!

- **మెదక్ టూరిజం అభివృద్ధిలో కలెక్టర్ ప్రతిమాసింగ్ కు దక్కిన ప్రతిష్టాత్మక అవార్డు.**
- **హైదరాబాద్ శిల్పారామంలో ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందజేత.**

**మెదక్ సెప్టెంబర్,26(సిరి న**



ప్రపంచ పర్యాటక దినోత్సవం (వరల్డ్ టూరిజం డే) పురస్కరించుకుని హైదరాబాద్ శిల్పారామం లోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్‌కు ప్రతిష్టాత్మక "ఉత్తమ పర్యాటక ప్రతిభ అవార్డు" లభించింది. రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, జిల్లా కలెక్టర్‌కు ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్,జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి, చారిత్రక కట్టడాల సంరక్షణకు, పర్యాటకులకు కల్పించిన మెరుగైన వసతుల విషయంలో జిల్లా యంత్రాంగం చూపిన అద్భుత ప్రతిభకు గానూ ఈ పురస్కారం దక్కింది.

**ఈ సందర్భంగా గౌరవ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ:**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడంలో జిల్లా మెదక్ కలెక్టర్ తీసుకున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలతో పర్యాటక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**అవార్డు గ్రహీత, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..**

ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గౌరవ ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు రావడం వెనుక జిల్లా పర్యాటక శాఖ అధికారులు,సిబ్బంది మీడియా,ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ పురస్కారం తమపై బాధ్యతను మరింత పెంచిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి గారితో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పర్యాటక రంగ ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తూప్రాన్ కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



**తూప్రాన్, సెప్టెంబర్ 26( సిరి న్యూస్) :**

తూప్రాన్ పట్టణంలో నూతనంగా మంజూరైనా జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని శనివారం పరిశీలించిన్న జిల్లా న్యాయమూర్తి నీలిమ కోర్టు భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మిగితా పనులను త్వరగా పూర్తి చేయాలనీ అదేశించారు. పనులు పూర్తియితే కోర్టు ప్రారంభం వల్ల తూప్రాన్ తో పాటు పరిసర మండలాల ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ అర్ డి ఓ బావయ్య, డిఎస్పీ నరేందర్ గౌడ్, సిఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ గంగరాజు, డైప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సునీత రెడ్డి

- **శెట్టిపల్లి గ్రామంలో విస్తృత పర్యటన**

**వెల్దుర్తి, సెప్టెంబర్ 26, (సిరి న్యూస్ ):**




శనివారం వెల్దుర్తి మండలం శెట్టి పల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వెల్దుర్తి మండలం శెట్ట్ పల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే సునీత రెడ్డి అలాగే మూడు లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు కూడా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వెల్దుర్తి నుండి మెదక్ వరకు కనీసం మొరంపోసి రోడ్డును గుంతలు లేకుండా చేయాలని కలెక్టర్ ను కోరామని వారు తెలిపారు. గ్రామంలోని మహిళలతో మాట్లాడి ఇంకేమైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకురావాలని గ్రామ సర్పంచ్ శేఖర్ కు తెలియజేశారు. గ్రామస్తులు మహిళలు మాట్లాడుతూ రోడ్డు వల్లనే మాకు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడిగే శేఖర్ , మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, నాయకులు కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రంగి కృష్ణ, పడిగే నరసింహులు,శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, మహేందర్, రమేష్ చందర్ గుప్తా, అశోక్ గౌడ్, శాఖరం శ్రీనివాస్ గౌడ్, వెల్దుర్తి ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, ఏపీఎం సుభాష్, వెల్దుర్తి మండల సీనియర్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

# చెట్లను అక్రమంగా నరికివేతపై పదివేల జరిమానా

**తూప్రాన్ సెప్టెంబర్ 26 సిరి న్యూస్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలో మున్సిపల్ సిబ్బంది నాటిన చెట్లను శనివారం రాత్రి సమయంలో అక్రమంగా నరికివేసిన ఘటనపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ ఆదేశాల మేరకు పట్టణానికి చెందిన జమాల్పూర్ రామ్ అనే వ్యక్తి అనుమతి లేకుండా 3 చెట్లను నరికివేసినందుకు రూ.10,000 .జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంతో కీలకమని మున్సిపల్ అనుమతి లేకుండా చెట్లను నరికివేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. మున్సిపల్ చట్టం ప్రకారం చెట్లను అక్రమంగా నరికివేసే వారిపై జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు చెట్లను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు.



# చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 26, :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్ స్పష్టం చేశారు. వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సుడా పార్కు (వేములవాడ కామన్) వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, సిద్దిపేట పట్టణ రజకులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తా..

- టియూడబ్ల్యూజె (హెచ్–143) ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ ఎన్నిక



**రామచంద్రపురం, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (హెచ్-143) పటాన్‌చెరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్ బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పెన్నే మా ఆయుధం.. ప్రజలే మా బలం.. సమాజమే మా లక్ష్యం' అనే యూనియన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బాలకృష్ణ ఎన్నిక పట్ల యూనియన్ నాయకులు, జర్నలిస్టులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారి దేవస్థానము లోని
# గణపతి లడ్డు 1,16,116



**శివంపేట్ సెప్టెంబర్ 26( సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని చిన్నగొట్టిముక్క చాకరిమెట్ల స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయ స్వామి వారి దేవస్థానము లో గణపతి నిమజ్జననోస్తవము సందర్భంగా లడ్డు వేలం పాట నిర్వహించగా అభిరామ్ బిన్నిరైస్ మిల్ నర్సాపూర్ గ్రామము చెర్విరాల శ్రీనివాస్ గుప్తా మహేశ్వరి దంపతులు రూ.1,16,116/లకు పాట పాడి లడ్డు కైవసం చేసుకున్నారు. వేలము పాటలో వచ్చిన ఆదాయము అన్నపసాదముకు బియ్యము కొనుగోలు చేసి దేవస్థానముకు ఇవ్వాలని దేవస్థానము ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ బి. ఆంజనేయ శర్మ గారు దాతకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానము అర్చకులు , నర్సాపూర్ అయ్యప్ప మారుతి క్లాత్ స్టోర్ (గణపతి విగ్రహ దాత), పాత్లోత్ హర్సింగ్ భక్తులు దేవస్థానము సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్ధంగా అన్నదానం



**సదాశివపేట. సెప్టెంబర్ 26. (సిరిన్యూస్)**

పట్లూరి అనురాధ అశోక్ గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమారుడు పట్లూరి నాగరాజుగౌడ్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుటంబ సభ్యులు కౌన్సిలర్ పట్లూరి రోజా, స్రవంతి,ప్రసాద్ గౌడ్, రేణుక,ఆంజనేయులు గౌడ్,
సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, కౌన్సిలర్ కొత్తగొల్ల శేఖర్,నాగులపల్లిపావనగౌడ్, తిరుపతి, శ్రీరామ్ సేన యూత్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన వారికి నిర్వాహకులు అన్నప్రసాదాన్ని అందించారు.

# సీఈసీపై విపక్షాల పోరు.. 30న 'ఇండియా' భేటీ

- ఈసీ, ఓటర్ల జాబితాలు, ఎస్ఐఆర్‌పై ఉమ్మడి కార్యాచరణకు కసరత్తు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికల సంఘంలో ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం వెల్లడించింది. గత పది నెలల్లో 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ కథనం పేర్కొంది. ఓటర్ల పేర్ల తొలగింపు, ఫామ్ 6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు ఇందులో ఉన్నట్లు తెలిపింది. అయితే ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న వాదనను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. భిన్నాభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో సహజమేనని, తుది నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని స్పష్టం చేసింది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనంలో పేర్కొన్న అభ్యంతరాల ఉనికిని ఈసీ ఖండించకపోయినా, వాటిని నిర్ణయ ప్రక్రియలో భాగంగా వచ్చిన సూచనలుగా పేర్కొంది.

**సీఈసీ రాజీనామాకు విపక్షాల డిమాండ్**

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలు ఆందోళనలకు దిగారు.ఇదే సమయంలో జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేందుకు పార్లమెంటులో మరో తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

# కాళ్లకల్ శివారులో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్

- గోదాంపై సంయుక్త దాడులు –296 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం.
- జిల్లా సివిల్ సప్లై అధికారి,నిత్యానందం.

**మెదక్ సెప్టెంబర్,26(సిరి న్యూస్)**



జిల్లా సివిల్ సప్లై అధికారి ఆదేశాల మేరకు, మెదక్ జిల్లా కాళ్లకల్ గ్రామ శివారులోని ఒక గోదాంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్నట్లు అందిన సమాచారంతో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సిములు మరియు మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో సివిల్ సప్లై సిబ్బంది, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన మొత్తం 296 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం, సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర
ముప్పు ఏర్పడే అవకాశం ఉందని జిల్లా సివిల్ సప్లై అధికారి తెలిపారు. ఇలాంటి అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల అక్రమ నిల్వ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లై అధికారి హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినా లేదా సమాచారం అందినా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా కలెక్టర్ పర్యటన...

- కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ..
- నవాబ్‌పేట జైన మందిరంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు..

**హత్నూర, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్):**



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హత్నూర మండలంలో శనివారం పర్యటించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ( కేజిబివి)ను తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థినుల వసతి గృహం, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న విద్యా బోధన, భోజనం, తాగునీరు, వసతి, పారిశుధ్యం తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి పాఠశాలలో వారికి ఎదురవుతున్న సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నవాబ్‌పేట గ్రామంలోని జైన మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జైన సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు చేశారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్‌కు స్వాగతం పలికి ఆలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం తదితర వివరాలను తెలియజేశారు. జిల్లా ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా స్థానిక అధికారులు తాసిల్దార్ ఫర్వీన్ షేక్, ఆలయ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.





# పూసలపాడు సబ్‌స్టేషన్‌లో 2 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

- పునరుత్పాదక ఇంధన వినియోగానికి ప్రోత్సాహం
- విజయవంతంగా గ్రిడ్‌కు అనుసంధానం
- లాంఛనంగా ప్రారంభించిన జోగిపేట డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏడీఈ నాగిరెడ్డి

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 26 (సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సబ్ డివిజన్ పరిధిలోని నాగలగిద్ద సెక్షన్‌లో ఉన్న 33/11 కేవీ పూసలపాడు సబ్‌స్టేషన్‌కు అనుసంధానించిన ఎం/ఎస్ డాకాన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన 2 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం విజయవంతంగా విద్యుత్ గ్రిడ్‌తో సమన్వయమైంది. ఈ మేరకు జోగిపేట డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, నారాయణఖేడ్ ఏడీఈ నాగిరెడ్డిలు ఈ నూతన సౌర విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సౌర విద్యుత్ కేంద్రం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అందించడం ద్వారా పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం మరింత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా గొప్ప తోడ్పాటు లభిస్తుందని డిఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు ద్వారా సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటం తగ్గి, స్వచ్ఛమైన మరియు స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు సమన్వయం కోసం టీజీఎస్పీడీసీఎల్ ఇంజినీరింగ్ బృందం అవసరమైన సాంకేతిక పరీక్షలు, రక్షణ వ్యవస్థల పరిశీలనలు, గ్రిడ్ స్థిరత్వానికి సంబంధించిన అన్ని ప్రమాణాలను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు వేగంగా కొనసాగుతోందని, భవిష్యత్తులో మరిన్ని సౌర విద్యుత్ కేంద్రాలు గ్రిడ్‌తో అనుసంధానమయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో స్థిరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్నామని, పూసలపాడు సబ్‌స్టేషన్‌కు అనుసంధానమైన ఈ 2 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రం ఆ దిశగా మరో ముందడుగుగా నిలుస్తుందని స్పష్టం చేశారు.



# సీఈసీపై మాజీ సీఎస్ సంచలన ఆరోపణ

- బీజేపీ తరపున పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ సూచించారన్న జిజి థామ్సన్
- పథనంతిట్ట నుంచి ఎంపీగా పోటీ చేస్తే కేంద్ర మంత్రి కావచ్చని చెప్పారంటూ వెల్లడి
- 2016లో ఢిల్లీ విమాన ప్రయాణంలో ప్రస్తావన వచ్చినట్లు వివరణ
- రాజకీయాల్లోకి రావాలన్న సూచనను తిరస్కరించానన్న మాజీ సీఎస్

**తిరువనంతపురం, సెప్టెంబర్ 26:**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై కేరళ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిజి థామ్సన్ చేసిన ఆరోపణలు కొత్త వివాదానికి దారితీశాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ తనకు సూచించినట్లు థామ్సన్ వెల్లడించారు. 2016లో తాను కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఢిల్లీకి విమానంలో కలిసి ప్రయాణిస్తుండగా ఈ ప్రస్తావన వచ్చిందని చెప్పారు. అయితే రాజకీయాల్లోకి రావాలన్న సూచనను అప్పుడే తిరస్కరించినట్లు తెలిపారు.

**పథనంతిట్ట నుంచి పోటీ చేయాలన్నారు**

జ్ఞానేష్ కుమార్ తనకు స్నేహితుడని థామ్సన్ పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత ఏం చేయాలనుకుంటున్నారని ఆయన అడగ్గా, పిల్లల కోసం ఓ ప్రాజెక్టుపై పనిచేయాలని భావిస్తున్నట్లు చెప్పానన్నారు. ఈ సందర్భంగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో పథనంతిట్ట నుంచి బీజేపీ తరపున పోటీ చేయాలని జ్ఞానేష్ కుమార్ సూచించినట్లు వెల్లడించారు. ఎన్నికల్లో గెలిచి ఎంపీ అయితే ఆ తర్వాత కేంద్ర మంత్రి అయ్యే అవకాశం కూడా ఉంటుందని చెప్పినట్లు వివరించారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే ఆలోచన తనకు లేదని, ఆ ప్రతిపాదనను వెంటనే తిరస్కరించినట్లు థామ్సన్ తెలిపారు.

**ఎస్ఐఆర్ వివాదం వేళ కొత్త ఆరోపణ**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే ప్రతిపక్షాలు సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయి. ఆయన రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో బీజేపీ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని తనకు జ్ఞానేష్ కుమార్ సూచించారంటూ మాజీ సీఎస్ థామ్సన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో సీఈసీ చుట్టూ మరో వివాదం తెరపైకి వచ్చింది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.